




# కరపత్రం

SINCE 2014

బుధవారం ఏప్రిల్ 16 2025 | సంపుటి :0 | సంచిక :184 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు: సీఎం రేవంత్‌రెడ్డి





- పార్టీ శాసనసభా పక్షం సమావేశం శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగింది
- సమావేశంలో నాలుగు కీలక అంశాలపై చర్చ జరిగింది
- పార్టీకి వ్యతిరేకంగా ప్రవర్తించిన ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ హెచ్చరించారు
- "పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు"
- మంత్రివర్గ విస్తరణపై అధిష్టాన నిర్ణయమే ఫైనల్

హైదరాబాద్: పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశం జరిగింది. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. " పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. పేజి 2లో

## త్వరలో ఆర్టీసీలో 3,038 పోస్టుల భర్తీ: ఎండీ సజ్జనార్



2లో

## 'బెంగాల్ మండిపోతుంటే.. మౌనమా!'.. దీదీపై యోగి ధ్వజం



2లో

ఒకవైపు బెంగాల్ మండిపోతుంటే.. సీఎం బెనర్జీ మౌనంగా ఉన్నారని, పైగా నిరసనకారులను శాంతిదూతలుగా పేర్కొంటున్నారని విమర్శించారు.

## భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



**తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.**

హైదరాబాద్: తెలంగాణలో భూములు, మద్యం విక్రయాలు, అప్పులతో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీపడుతోందన్నారు.
పేజి 2లో

## కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

**కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి**



హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి, ఇందిరమ్మ ప్రభుత్వానికి ప్రజలు మద్దతిచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలని పలువురు కోరుతున్నారంటూ భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వారం నుంచే అధికార దాహంతో కూల్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పేజి 2లో

## గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు





హైదరాబాద్: గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. పేజి 2లో

## పార్టీ మారుతున్నారా?.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఏమన్నారంటే..

పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత జీవన్‌రెడ్డి స్పందించారు.



2లో

## నాలుగు అంశాలపై చర్చ.. కొనసాగుతున్న సీఎల్పీ భేటీ



2లో

## చాక్లెట్ కోసం వెళ్లి.. మృత్యు ఒడికి చేరిన బాలుడు

ఎంతో ఆశతో చాక్లెట్ కొనుక్కుందామని బయటకి వెళ్లిన బాలుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది.



2లో

# ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డు ఆఫీసర్ కు సన్మానం





**ఖమ్మం కరపత్రం ప్రతినిధి:–**
ఉద్యోగ విరమణ పొందిన సత్తుపల్లి యూనిట్ హోంగార్డు ఆఫీసర్ మిట్టపల్లి వాణి ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ..సుదీర్ఘ కాలంగా వివిధ విభాగాలలో భాద్యతయుతమైన విధులు నిర్వహించి పోలీస్ శాఖ కు ఎనలేని సేవలతో పోలీస్ అధికారుల మన్ననలు పొందారని పోలీస్ కమీషనర్ కొనియాడారు.,, విధినిర్వహణలో తోడ్పాటు అందించిన కుటుంబ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావి జీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లు విడుదల

**– రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**హైదరాబాద్ కరపత్రం ప్రతినిధి :–**
బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ. 20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు.ఆర్ధికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు.ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు.గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు 12 మంది లబ్ధిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారని తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్ధిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణం పూర్తైన వెంటనే బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామని వివరించారు.బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్ధిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్ధిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు.కనీసం 400 ఎస్ ఎఫ్ టి కి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్ధిదారులు ఇంటిని నిర్మించుకోవాలని సూచించారు.అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని తెలిపారు.

# వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి
## స్త్రీ సమ్మిట్ కార్యక్రమంలో భట్టి విక్రమార్క

**హైదరాబాద్,ఏప్రిల్15 కరపత్రం**
వడ్డీలేని రుణాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశం లభించిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం నడుస్తోందని, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులుకు ఫ్రీ రుణాలు ఇస్తున్నామని చెప్పారు. స్వయం సహాయక గ్రూపులకు రూ.20 వేల కోట్లకు పైగా లోన్లు ఇస్తున్నట్లు చెప్పారు. హైదరాబాద్ తాజ్ దక్కన్ హోటల్ లో నిర్వహించిన స్త్రీ సమ్మిట్ 2.0 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు భట్టీ–. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ– కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ప్రారంభించి డిప్యూటీ సీఎం.. మహిళా సాధికారత కోసమే స్త్రీ సమ్మిట్ నిర్వహిస్తున్నామని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ– సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఒకవైపు స్త్రీలను దేవతలుగా చూస్తేనే మరోవైపు కంట్రోల్ చేయాలనే ప్రయత్నం తరతరాలుగా జరుగుతూనే ఉందని అన్నారు. హిందూ కోడ్ బిల్లుతోనే మహిళా సాధికారత ప్రారంభం అయ్యిందని, అంబేద్కర్ వల్లే మహిళలకు హక్కులు లభించాయని గుర్తు చేశారు. మహిళలకు వారతసత్వ హక్కులు లభించాయని తెలిపారు. తెలంగాణలో మహిళలకు ఫ్రీ బస్ స్కీం సక్సెస్ ఫుల్ గా నడుస్తోందని అన్నారు డిప్యూటీ– సీఎం. సోలార్ ఎ÷–లాంట్ నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించామని, దీంతో సోలర్ ఎ÷–లాంట్ నిర్వహణలో మహిళలకు భాగస్వామ్యం లభించిందని అన్నారు. ఇలాంటి స్త్రీ సమ్మిట్ లతో మహిళా సాధికారత సాధించవచ్చుని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వాన్ని కూలుస్తామంటే ఊరుకోం

**– పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ హెచ్చరిక**

**కరపత్రం హైదరాబాద్,ఏప్రిల్15**
కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోం అని.. ఇక్కడ ఎవరూ చేతులు కట్టుకుని కూర్చోలేదంటూ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు హెచ్చరించారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంత అవినీతి చేసిందో.. ఎంత దోచుకుందో.. కాంట్రాక్టర్ల పేరుతో తెలంగాణ జనం సొమ్మును ఏ విధంగా లూటీ చేసిందో అనటానికి.. కొత్త ప్రభాకర్ రెడ్డి వ్యాఖ్యలే

# త్వరలో ఆర్టీసీలో 3,038 పోస్టుల భర్తీ: ఎండీ సజ్జనార్

మొదటిపేజీ తరువాయి
: తెలంగాణ ఆర్టీసీలో 3,038 పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్లు సంస్థ వైస్ ఛైర్మన్, ఎండీ సజ్జనార్ తెలిపారు. ఇందుకు ప్రభుత్వం నుంచి అనుమతి కూడా వచ్చిందని, వీటి భర్తీ అనంతరం కార్మికులు, ఉద్యోగులపై పనిభారం తగ్గుతుందని చెప్పారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఆర్టీసీ కళాభవన్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. “కొత్తగా భర్తీ చేయనున్న పోస్టులకు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తాం. సంస్థలోని ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి యాజమాన్యం కట్టుబడి ఉంది. కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, రాజశేఖర్, ఖుస్రోషా ఖాన్, వెంకన్న, జాయింట్ డైరెక్టర్లు నర్మద, ఉషాదేవి, రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీలత, ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.ం

# నాలుగు అంశాలపై చర్చ.. కొనసాగుతున్న సీఎల్పీ భేటీ

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కొనసాగుతోంది. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరుగుతున్న ఈ భేటీలో.. ప్రధానంగా నాలుగు అంశాలపై చర్చ జరుగుతోంది. భూభారతి, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళు , ఎస్సీ వర్గీకరణ అంశాలతోపాటు ఇతర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విషయంపై నేతలు చర్చిస్తున్నారు. ఎమ్మెల్యేల అభిప్రాయాలు, సలహాలను ఈ భేటీలో తీసుకోనున్నారు. ఈ భేటీ అనంతరం సీఎం రేవంత్ రెడ్డి జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు.

# ‘బెంగాల్ మండిపోతుంటే.. మౌనమా!’.. దీదీపై యోగి ధ్వజం

మొదటిపేజీ తరువాయి
పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విమర్శలు చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి నిరసనగా రాష్ట్రంలో హింస చెలరేగుతున్నా మమత తనకు ఏమీ పట్టనట్టుగా ఉన్నారని అన్నారు. గత వారం రోజులుగా ముర్షిదాబాద్ మంటల్లో మండిపోతుంటే.. సీఎం మౌనంగా ఉన్నారని విమర్శించారు. లౌకికవాదం పేరుతో రాష్ట్రంలో అల్లర్లను సృష్టించేవారికి ఆమె పూర్తి స్వేచ్ఛను ఇచ్చి.. చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి అరాచకాలను అదుపులో ఉంచాల్సి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉంటుందని అన్నారు.
ఆందోళనకారులను ఆమె శాంతిదూతలుగా భావిస్తారని..కానీ హింసకు అలవాటుపడిన వారు ఆమె మాటలను కూడా లెక్క చేయరని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడుతున్నామని చెప్పుకునే ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ నేతలు బెంగాల్లో ఇంత విధ్వంసం జరుగుతుంటే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికి భద్రత బెంగాల్‌కు భద్రతా దళాలను పంపినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో చేపట్టిన ఆందోళనలు ఉద్రిక్తం అవడంపై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఆందోళన వ్యక్తం చేశారు. నిరసనల పేరిట సీఎం మమతా బెనర్జీ హింసను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంటు ఆమోదించిన చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని దీదీ చెప్పారని గుర్తుచేశారు.
వక్ఫ్ చట్టం గతవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో శనివారం బెంగాల్‌లోని మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి.. రోడ్లను దిగ్బంధించారు. ఘర్షణల్లో ముగ్గురు మృతిచెందగా.. 110 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. దీనిపై మమత మాట్లాడుతూ..ఈ చట్టాన్ని బెంగాల్‌లో అమలు చేయబోమని పునరుద్ఘాటించారు. అయితే ఈ హింసలో ఉగ్రసంస్థల హస్తం ఉందని..వారే యువకులను రెచ్చగొట్టి దాడులకు పాల్పడేలా చేస్తున్నారని ఇంటెలిజెన్స్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# చాక్లెట్ కోసం వెళ్లి.. మృత్యు ఒడికి చేరిన బాలుడు

మొదటిపేజీ తరువాయి
చెన్నారావుపేట: ఎంతో ఆశతో చాక్లెట్ కొనుక్కుందామని బయటకి వెళ్లిన బాలుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ విషాద ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం పూల్లయ్యబోడుతండాలో చోటు చేసుకుంది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వెంకన్న, జ్యోతి దంపతుల కుమారుడు అనిల్ అయోధ్యపురం ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం పాఠశాల నుంచి వచ్చి ఇంట్లో కొద్దిసేపు ఆడుకున్నాడు.
ఆ తర్వాత చాక్లెట్ కోసం కొద్ది దూరంలో ఉన్న దుకాణానికి వెళ్తుండగా.. అటువైపుగా వచ్చిన టిప్పర్ అతడిని ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అది గమనించిన తండా వాసులు డ్రైవర్‌పై దాడి చేశారు. ప్రమాద సమయంలో డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలికి చేరుకున్న చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి.. గాయపడిన డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షపాతం: ఐఎండీ

ఈ ఏడాది రుతుపవన కాలంలో సాధారణం నుంచి అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు ఐఎండీ అంచనా వేసింది.
దిల్లీ: దేశానికి ఈ ఏడాది రుతుపవన కాలం ఆశాజనకంగా కనిపిస్తోంది. భారత్‌లో సాధారణం కన్నా అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్లు భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం రంగం వాటా 18 శాతం ఉన్నందున.. ఇది రైతులకు శుభవార్త అని నిపుణులు అంటున్నారు.
“జూన్ నుంచి సెప్టెంబరు వరకు దేశంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు 87 సెంటీ మీటర్లుగా ఉండగా.. ఈసారి అంతకన్నా ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది” అని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర వెల్లడించారు. ఈ సారి ఎల్‌నినో లాంటి పరిస్థితి ఏర్పడే అవకాశం లేదని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. మరోవైపు.. ప్రైవేటు వాతావరణ సంస్థ స్కైమెట్ కూడా ఇటీవల తన నివేదికను విడుదల చేసింది.
శిశువుల అక్రమ రవాణా జరిగితే ఆస్పత్రి లైసెన్స్ రద్దు: సుప్రీం
రాబోయే ‘నైరుతి’ సీజన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది. మార్చి వరకు వాతావరణ పరిస్థితులు, పలు అంశాలను విశ్లేషించిన తర్వాత ఈ విషయాన్ని వెల్లడించింది. జూన్ నుంచి సెప్టెంబరు మధ్యకాలంలో దేశంలో సగటున 868.6 మి.మీ వర్షం కురుస్తుందని అంచనా వేస్తోంది. నైరుతి సీజన్ నెమ్మదిగా ప్రారంభమైనా మధ్యలో వర్షాలు వేగం పుంజుకోనున్నాయని పేర్కొంది. పశ్చిమ, దక్షిణ భారతదేశంలో సమృద్ధిగా వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది.

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు: సీఎం రేవంత్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదు” అని సీఎం తేల్చి చెప్పారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. “రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలి” అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

**సీఎం రేవంత్‌రెడ్డికి తప్పిన ప్రమాదం**
తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి త్రుటిలో ప్రమాదం తప్పింది. నోవాటెల్ హోటల్‌లో సమావేశం పూర్తయిన తర్వాత హోటల్‌లో కిందకు వస్తుండగా.. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తు కంటే లోపలికి దిగిపోయింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది లిఫ్ట్‌ను ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను కిందకు పంపించారు.

# గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్‌బాబు

మొదటిపేజీ తరువాయి
“దిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమెజాన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ, మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు” అని శ్రీధర్‌బాబు అన్నారు.

# కేసీఆర్ సూచనతోనే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి
హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు.
రాష్ట్రంలో పార్టీలు, మతాలు, కులాలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని పొంగులేటి తెలిపారు. అర్హులైన అందరికీ సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై ఇప్పటికే జీవోను విడుదల చేశామన్నారు. “భూభారతి’ వచ్చాక కొత్త ప్రభాకర్‌రెడ్డి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. గతంలో అక్రమంగా భూములు కొల్లగొట్టారు. వాటిని భూభారతి ద్వారా ప్రభుత్వం తిరిగి తీసుకుంటుంది. అందుకే ఆయన భయాందోళనకు గురవుతున్నారు. కేసీఆర్ సూచన మేరకే ప్రభాకర్‌రెడ్డి ఆ వ్యాఖ్యలు చేశారు. 400 ఎకరాల భూమిని ప్రభుత్వం వెనక్కి తీసుకోవడాన్ని భారాస నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. భూభారతితో పేదల ఆస్తులను తిరిగి పేదలకు పంచుతాం. ఇందిరమ్మ ప్రభుత్వాన్ని కూలుస్తామని పగటి కలలు కంటున్నారు. కొత్త ప్రభాకర్‌రెడ్డి కేసీఆర్ ఆత్మ. ఈ ప్రభుత్వంపై మొదటి నుంచి కుట్రలు జరుగుతున్నాయి. వెంటనే సీఎం అయిపోవాలని తండ్రి, కుమారుడు చూస్తున్నారు” అని పొంగులేటి వ్యాఖ్యానించారు.
కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలు.. కుట్రకోణంగా భావిస్తున్నాం: ఆది శ్రీనివాస్
భారాస ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఖండించారు. ప్రభుత్వాన్ని పడగొట్టాలనే యత్నాన్ని కుట్రకోణంగా భావిస్తున్నామన్నారు. ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరతామని చెప్పారు. కుట్రకోణం ఉన్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# భూముల అమ్మకంలో భారాసతో కాంగ్రెస్ పోటీ: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి
హెచ్‌సీయూ అంశంలో తనపై కేసు పెడితే ఎదుర్కొనేందుకు సిద్ధమని తెలిపారు. అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లను నరికిన ప్రభుత్వాలను చూశామా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు.
భాజపా రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేమీ లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ఎన్నికకు మరో వారం రోజుల సమయం పట్టే అవకాశముందని తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడి ప్రతిపాదనల్లో తన పేరు లేదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. తమిళనాడులో ఎన్డీఏను పునరుద్ధరించామని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నామన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ తమ పార్టీ నేత అని.. ఆయన అంశంపై అంతర్గతంగా చర్చించుకుంటామని తెలిపారు.

# పార్టీ మారుతున్నారా?.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఏమన్నారంటే..

మొదటిపేజీ తరువాయి


హైదరాబాద్: పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ, సీనియర్ నేత జీవన్‌రెడ్డి స్పందించారు. అవన్నీ ఊహాగానాలేనని కొట్టిపారేశారు. జిల్లాలో దశాబ్దకాలం ఒంటరిగా పోరాటం చేశానన్నారు. కాంగ్రెస్ అంటే జీవన్‌రెడ్డి.. అనే విధంగా పార్టీ బలోపేతానికి కృషి చేశానని చెప్పారు. మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు.
“కాంగ్రెస్‌లో వీహెచ్ తర్వాత నేనే సీనియర్‌ను. జానారెడ్డి కూడా నాకంటే నాలుగేళ్ల తర్వాత వచ్చారు. పార్టీలో సీనియార్టీకి స్థానం ఏమిటనే బాధ నాలో ఉంది. కొందరు సీనియర్లు వారి అభిప్రాయాలతో మాట్లాడి ఉండొచ్చు”అని జీవన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

# న్యాయ వ్యవస్థ రాజ్యాంగానికి అతీతమా !

# రాష్ట్రపతికే ఆదేశాలు జారీచేసిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

- ఈ ఆదేశం భారత రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తుందా!
- ఈమధ్య న్యాయస్థానాల ద్వారా పరస్పర విరుద్ధమైన తీర్పులు వెలుబడుతున్నాయి.

**బోయిని సత్యనారాయణ, న్యాయవాది**

దీనికి తాజా ఉదాహరణ మొన్న 8 ఏప్రిల్ రోజున సుప్రీంకోర్టుకు చెందిన ఇద్దరు న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దివాలా మరియు జస్టిస్ ఆర్. మహదేవన్ లు ఏకంగా రాష్ట్రపతికే సమన్లు జారీచేయడం, రాష్ట్రపతి నిర్ణయాధికారానికి కేవలం మూడు నెలల గడువు ఇవ్వడం ఇప్పుడు మనదేశంలో ఒక నూతన చర్చకు దారితీసింది.ఈ తీర్పు కేవలము చర్చకు మాత్రమే పరిమితం కాబోదు అనిపిస్తున్నది. మన దేశ శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య ఒక వివాదానికి కారణమవుతుందా? అనిపిస్తున్నది.

సుప్రీంకోర్టు తీర్పు మన దేశ శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థలను శాసిస్తున్నదా అనే ఒక కొత్త సంవాదానికి కారణం అవుతుంది అనిపిస్తుంది.

ఈ వివాదానికి మూల కారణము తమిళనాడు రాష్ట్రం అయ్యింది. గత కొంతకాలంగా తమిళనాడు శాసన సభ చేస్తున్న తీర్మానాలు ప్రజాస్వామిక విలువలకు, పౌర విలువలకు విరుద్ధమైనవని ఆ రాష్ట్ర గవర్నర్ భావిస్తున్నారు. తమిళనాడు శాసన కర్తలు,శాసన అధికారాలను ఇష్టారాజ్యంగా ఉపయోగిస్తున్నారని తమిళనాడు గవర్నర్ భావించారు. ఆమోదం కోసం శాసనసభ పంపిన తీర్మానాలను గవర్నర్ తన వద్దనే పెట్టుకున్నారు. ఆ బిల్లులకు ఎలాంటి ఆమోదం తెలుపలేదు.తరువాత, కొద్ది కాలానికి గవర్నర్ రాజ్యాంగంలో సూచించిన నిర్దేశాల ప్రకారం మేరకు ఆ బిల్లులను రాష్ట్రపతి సమీక్షకు పంపించారు. ఇంతవరకు గవర్నర్ నిర్ణయము రాజ్యాంగ ప్రాదేశిక సూత్రాల ప్రకారమే జరిగినట్టే భావించాలి. తమిళనాడు ప్రభుత్వము పంపిన తీర్మానాలను ఆ రాష్ట్ర గవర్నర్ రాష్ట్రపతికి పంపిన తర్వాత ఇంకా వాటిపై ఎలాంటి నిర్ణయం రాష్ట్రపతి కార్యాలయం ద్వారా తీసుకోబడలేదు.ఈ విషయంపై కోర్టు జోక్యాన్ని ఆశిస్తూ తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు సుప్రీంకోర్టులను ఆశ్రయించింది.ఇక్కడే ఒక కొత్త రాజ్యాంగ సంక్షోభ సృష్టికి సుప్రీంకోర్టు ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు కొత్త వివాద సృష్టికి బీజం వేసినట్టుగా అయ్యింది.

- **ఏప్రిల్ 8వ తేదీన వెలువడిన 415 పేజీల ఈ తీర్పులో పాకిస్తాన్ రాజ్యాంగాన్ని పేర్కొనడం న్యాయ కోవిధులను రాజకీయ పరిశీలకులను ఆశ్చర్యపరిచింది**

పాకిస్తాన్ రాజ్యాంగం లోని 75 వ ఆర్టికల్ ను ఉటంకిస్తూ, పాకిస్తాన్ రాష్ట్రపతి 10 రోజులలోగా బిల్లుల మంజూరు చేయవలసి ఉంటుందని పేర్కొనడం అంతులేని వేదనకు కారణమైంది.పాకిస్తాన్ లో ఎప్పుడు ప్రజా ప్రభుత్వం సజావుగా నడవలేదు. అక్కడ మిలిటరీ పరిపాలన ఎప్పుడు ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తూ ఉంటుంది. మిలటరీ జోక్యం తోనే పాకిస్తాన్ పాలన నడుస్తుంది. పాకిస్తాన్ రాజ్యాంగ నడక మన భారత దేశానికి ఎలా దిక్సూచి అవుతుందన్నదే ఇప్పుడు అవమానంగా తోస్తున్నది.శాసన సభ, పార్లమెంటు తీర్మానాలలో సంక్లిష్టత తలెత్తినప్పుడు, సంశయాత్మక విషయాలపై రాష్ట్రపతి గాని, కేంద్ర ప్రభుత్వం గానీ సుప్రీంకోర్టు న్యాయ కోవిదుల సలహాలు స్వీకరిస్తుంది.సలహా మాత్రమే స్వీకరించే అవసరాన్ని రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 143, 143 (1) ప్రకారం రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహా స్వీకరించవచ్చు కానీ పాటించాలన్న నియమము రాజ్యాంగంలో ఎక్కడా పొందుపరచబడలేదు. లిఖిత రాజ్యాంగ సూత్రాలకు భిన్నంగా అనుభవ జ్ఞానాన్ని, విచక్షణను ప్రదర్శించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి, రాష్ట్రపతికి సంపూర్ణంగా దఖలు పడింది.75 సంవత్సరముల స్వతంత్ర భారత దేశంలో ఇది మొదటిసారిగా సంభవించిన సంకటం ఈ తీర్పు.మన దేశ త్రివిధ దళాలకు, భారత ప్రభుత్వానికి మొత్తం దేశానికి కేంద్ర బిందువు అయిన రాష్ట్రపతికి సుప్రీంకోర్టు "రిట్ మాండమస్" అంటే చట్టపరమైన ఆదేశం జారీ చేయడం ఈ నూతన రాజ్యాంగ సంక్షోభ చర్చకు కారణమయ్యింది. అసలు సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి నియామకం,ప్రమాణ స్వీకారం చేయించాల్సిన భాధ్యత,అధికారం రాష్ట్రపతికి చెందినది.అటువంటి సర్వోన్నత శక్తి కేంద్రమైన రాష్ట్రపతికి ఆదేశాలు జారీ చేయడం ఒక వింత విషయంగా మారింది.ఈ "రిట్ మాండమస్" సాధారణంగా కింది కోర్టుల పైన, ప్రభుత్వ అధికారులు,ప్రభుత్వ శాఖల పైన సుప్రీంకోర్టు ఉపయోగిస్తుంది. ఆర్టికల్ 139 ఇంత వరకు మాత్రమే అనుమతించింది.కానీ మొదటిసారి భారత "సుప్రీం పవర్ రాష్ట్రపతి"కే ఆదేశం ఇవ్వడము ఆశర్యం గొలిపే అంశం.అంతకుమించి బాధాకరమైన అంశం.భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 సుప్రీం కోర్ట్ కు శాసన సంబంధ జాప్యం సమీక్ష చేసే అధికారం మాత్రమే ఇచ్చింది. దీని అర్థం రాజ్యాంగ సవరణ చేసే అధికారం కాదు.రాష్ట్రాల గవర్నర్లకు, రాష్ట్రపతికి రాజ్యాంగం "నేచురల్ ఇమ్యూనిటీ" ని అంటే ఒక సహజ నిరోధక శక్తిని అధికారాన్ని ప్రసాదించింది.రాష్ట్రపతి యొక్క విచక్షణను, నిర్ణయాధికారాన్ని ప్రశ్నించే అధికారం సుప్రీంకోర్టుకు కూడా లేదు.

చివరికి సుప్రీం కోర్టు కూడా గవర్నర్లకు గాని రాష్ట్రపతి గాని సమన్లు జారీ చేయడం వీలుకాదు.గవర్నర్లు,రాష్ట్రపతి రాజ్యాంగ వ్యవస్థకు ప్రతినిధులు.దీని అర్థం సుప్రీంకోర్టుకు న్యాయ వివాదాలను సంశయాలను సమీక్షించే అధికారం లేదని అనలేము. కానీ రాజ్యాంగ విధివిధానాలను నిర్ణయించి నిర్ధారించే అధికారం సుప్రీం కోర్టుకు లేదు.అది కేవలం భారత పార్లమెంట్ కు మాత్రమే సంక్రమించిన అధికారం.ఈ తీర్పులో కేవలం రాష్ట్రపతికి ఆదేశాలు ఇవ్వడమే కాదు రాజ్యాంగ సమీక్షకు,చర్చకు ఈ తీర్పు ఒక అవాంచిత కారణమైంది.భారత రాజ్యాంగం ఆర్టికల్ 200, 201 ప్రకారం శాసనసభ చేసిన తీర్మానం గవర్నర్ ఆమోదానికి పంపినప్పుడు, ఆ నిర్ణయం పై గవర్నర్ కు ఏదైనా సందేహం ఉన్నప్పుడు రాష్ట్రపతికి పంపే అధికారం గవర్నర్ కు రాజ్యాంగం కల్పించింది. లేదా గవర్నర్ శాసనసభ పంపిన బిల్లును పునః సమీక్ష కొరకు తిరిగి శాసనసభకు తిప్పి పంపే అవకాశం గవర్నర్ కు ఉంది.



The judgment in the Tamil Nadu case was delivered by a two-judge bench of Justice JB Pardiwala and Justice R Mahadevan. With the ruling, the Supreme Court set a three-month deadline for the President on Bills referred by governors. This, in a way, takes away the President's power of "absolute veto".

ఈ సుప్రీం కోర్ట్ తీర్పు ప్రకారం రాజ్యాంగ సమీక్ష చేసే అధికారాన్ని ఏకపక్షంగా సుప్రీంకోర్టు తన చేతిలోకి తీసుకున్నప్పుడు పార్లమెంటు ఏమి చేయాలన్న ఒక కొత్త వివాదం మన దేశం తొలిసారిగా ఎదుర్కొంటున్నది.

- **ఏదైనా శాసనసభ గాని, పార్లమెంటు గాని జాతి వ్యతిరేక తీర్మానాలు చేసినప్పుడు విధిగా గవర్నర్లు రాష్ట్రపతి వాటిని ఆమోదించాల్సిందేనా?. మన రాజ్యాంగ నిర్మాతలు ఈ విషయం దృష్టిలో పెట్టుకొని బిల్లుల ఆమోదానికి గడువు తీసుకునే వెసులుబాటు గవర్నర్లకు రాష్ట్రపతికి కల్పించి ఉంటారు**

ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగ రచయితలు ఆర్టికల్ 143 (3) ద్వారా సుప్రీంకోర్టుకు సమీక్ష చేయడానికి మాత్రమే వెసులుబాటు కల్పించారు.ఈ ఆర్టికల్స్ ద్వారా సుప్రీం కోర్ట్ న్యాయమూర్తులు అందరూ రాజ్యాంగ పీఠము ఏర్పాటు చేసి పరిష్కారము కనుక్కొనే స్వేచ్ఛ అధికారము న్యాయవ్యవస్థకు కల్పించారు. కానీ 8 ఏప్రిల్ రోజు సుప్రీంకోర్టు లోని ఇద్దరు న్యాయమూర్తులు పూర్తి రాజ్యాంగ పీఠం కాదు.

- **రాజ్యాంగ పీఠంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కాకుండా ఇంకా ఏడుగురు న్యాయమూర్తులు ఉంటారు.ఇందులో ఐదుగురు న్యాయమూర్తుల ఏకాభిప్రాయము మెజారిటీ తీర్పుగా,రాజ్యాంగ పీఠం తీర్పుగా పరిగణించబడుతుంది.కానీ, రాష్ట్రపతికి సూచనలు జారీచేసిన ఏప్రిల్ 8వ తేదీ నాటి తీర్పు వెలువరించిన న్యాయమూర్తులు కేవలం ఇద్దరు మాత్రమే**

రాజ్యాంగ సమీక్ష కొరకు ఆర్టికల్ 145(3) కనీసం 5 గురు సభ్యులతో కూడిన సుప్రీమ్ కోర్టు ఫుల్ బెంచ్ ఏర్పాటు చేయమని భారత రాజ్యాంగం స్పష్టంగా సూచించింది.

మరి,కేవలం ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు ఒక అభిప్రాయంగా చూడవచ్చేమో కానీ,తీర్పు గా పరిగణించబడుతుందా అనేది ఇప్పుడు ప్రముఖ వివాదంగా మారబోతున్నట్టు అనిపిస్తున్నది.భారత అపెక్స్ కోర్టుగా పిలువబడే సుప్రీంకోర్టులో మొత్తము 34 మంది న్యాయమూర్తులు ఉన్నారు.పూర్తి రాజ్యాంగ పీఠం సమీక్ష అంటే కనీసం 20 మంది న్యాయమూర్తుల ఏకాభిప్రాయము అవసరం ఉంటుంది. కానీ, కేవలం ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు అసలు పరిగణించబడని, పరిగణించ కూడనిదిగా న్యాయ కోవిదులు భావిస్తున్నారు.బాబా సాహెబ్ అంబేద్కర్ తో పాటు రాజ్యాంగ రచయితలు కల్పించిన ఈ వెసులుబాటును ఈ ఇద్దరు న్యాయమూర్తులు ఉల్లంఘించినట్టుగా, రాజ్యాంగ సమీక్ష చేసే అధికారం చేతుల్లోకి తీసుకున్నట్టుగా న్యాయ కోవిదులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

- **ప్రపంచంలోనే ఉన్నతమైన భారత రాజ్యాంగము సవరణను కేవలం ఇద్దరు న్యాయమూర్తులు చేసే అవకాశం ఉన్నదా?**

శాసనసభలు, పార్లమెంటు చేసే రాజ్యాంగ సమీక్షలను సవరణలను విచారించే అధికారం సుప్రీంకోర్టుకు కచ్చితంగా ఉంది.కానీ అదే రాజ్యాంగంలో సూచించిన ఆర్టికల్స్ ప్రకారము ఈ ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు రాజ్యాంగ విధి విధానాలను నిర్ణయించే అధికారం ఏ విధంగా వర్తిస్తుందో అన్న బలమైన అనుమానం ఇప్పుడు భారత న్యాయ కోవిదుల ముందర, మేధావుల ముందర నిలుచున్నది.

సుప్రీం కోర్టు ప్రతి శాసన తీర్మానాన్ని సమీక్ష చేయవచ్చు, సూచన చేయవచ్చు కానీ రాజ్యాంగ సవరణలను చేసే అధికారం సుప్రీం కోర్టుకు లేదు.ఇది కేవలం పార్లమెంటుకు సంబంధించిన అంశం.దేశంలోని అన్ని వర్గాలు అన్ని ప్రాంతాలు అన్ని అంశాలు పరిగణలోకి తీసుకున్న ప్రజా ప్రతినిధుల సూచనలను, వారి వారి అనుభవాలను, దూరదృష్టిని రంగరించి పార్లమెంట్ లో చేసేవే నిజమైన రాజ్యాంగ సవరణలు.

- **ఏప్రిల్ 8వ తేదీ నాటి ఇద్దరు న్యాయమూర్తులు సుప్రీంకోర్టు తీర్పు మన భారత దేశ సర్వసత్తాక గణతంత్ర స్వభావాన్ని కించపరిచేదిగా ఉందనే బాధ న్యాయ కోవిధుల్లో కనిపిస్తున్నది.**

రాజ్యాంగ సమీక్ష చేస్తున్న ఈ ఇద్దరు న్యాయమూర్తులు తమ తీర్పులో శ్రీలంకను, పాకిస్తాన్ ను ప్రస్తావించడం నిజంగా ఆక్షేపణీయమే. ఈ రెండు దేశాల రాజ్యాంగ అమలు తీరు మన దేశానికి ఏ విధంగానూ సరిపోలదు.ఈ రెండు దేశాల తోపాటు ఇంకొక దేశం పేరు మన న్యాయమూర్తులు ఈ తీర్పులో ఒక ఉదాహరణగా తీసుకోవడం విజ్ఞులు భరించలేకపోతున్నారు. ఆ దేశం పేరు మీలో ఎవరు కూడా విని ఉండరు..ఆ దేశం పేరు "రిపబ్లిక్ ఆఫ్ కిరిబాతి".

కిరిబాతి ఒక ద్వీపదేశం. ఈ దేశ జనాభా ఒక లక్ష పంతొమ్మిది ( 119000) వేలు మాత్రమే. కేవలం 811 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన ఈ దేశము మనదేశ సంస్కృతి సంప్రదాయాలకు నాగరికతకు చరిత్రకు,రాజ్యాంగ ఆచరణకు ఏ విధంగా ఉదాహరణగా నిలుస్తుందో ఆ న్యాయమూర్తులే వివరించాలి. ఈ "కిరిబాతి" దేశం ప్రపంచ పటములో ఎక్కడ ఉందో వెతికినా కనిపించదు. కిరిబాతి లో రాజకీయ సంక్షోభం తలెత్తినప్పుడు అక్కడి రాజ్యాంగ సంక్షోభం మన దేశానికి ఎలా ఆదర్శమవుతుందో తెలియదు.కిరిబాతి రాజ్యాంగ సంక్షోభ నివారణ, మన దేశ శాసన వ్యవస్థలకు గవర్నర్ రాష్ట్రపతుల మధ్యలో జరిగే వ్యవహారాలకు ఏ విధంగా సరిపాటి అవుతుందో ఆ న్యాయమూర్తులు మాత్రమే వివరించాల్సి ఉంటుంది. మన దేశంలో ఒక సి గ్రేడ్ మున్సిపాలిటీ కి సమానం కాని జనాభా మాత్రమే ఉన్న చిన్న దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ కు ఆదర్శంగా చూపడం గురించి బాధపడడం మాత్రమే మిగిలింది.మన దేశ రాజ్యాంగము శాసన వ్యవస్థ, పాలన వ్యవస్థ, న్యాయ వ్యవస్థల మధ్య స్పష్టమైన విభజన రేఖ గీసింది. స్పష్టమైన విధివిధాలను నిర్దేశించింది. ఒకరి కార్య క్షేత్రంలోకి ఇంకొకరు ప్రవేశించకుండా భారత రాజ్యాంగం కట్టుదిట్టమైన ఏర్పాటు చేసింది.గత కొంతకాలంగా కోర్టులు వివిధ కేసుల విచారణలో చేస్తున్న వ్యాఖ్యానాలు కూడా న్యాయ కోవిదులకు రుచించడం లేదు. కేసు విచారణతో సంబంధం లేకుండా న్యాయమూర్తులు రికార్డులోకెక్కని కామెంట్లతో కక్షిదారులు, న్యాయవాదులు కూడా విసుక్కుంటున్న సందర్భాలను మనం చూస్తున్నాము.

ఇక చివరగా, ఏప్రిల్ 8వ తేదీ నాటి రాజ్యాంగ సమీక్ష పై తీర్పు వెలవరించిన ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఈ అధికారం ఉందా అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ.

సంపూర్ణ న్యాయ పీఠం కాని ఖండిత న్యాయ పీఠం, కేవలం ఇద్దరంటే ఇద్దరు న్యాయమూర్తులు ఇలా తీర్పు వెలువరించవచ్చా అన్నదే ఈ చర్చ.ఇద్దరు న్యాయమూర్తులు కొత్తగా సృష్టించిన రాజ్యాంగ సంక్షోభ నివారణ ఎలా అనే సమస్య మన ముందు నిలిచింది.ఖండిత న్యాయపీఠం రాజ్యాంగ సమీక్ష చేయడము ఏ విధంగా సమర్థనీయమో తేలాల్సి ఉన్నది.ప్రతి చట్టం, ప్రతి రాజ్యాంగ సవరణ బాధ్యత పార్లమెంట్ కు సంబంధిన అంశం.ఈ పార్లమెంట్ తీర్మానాలకు ఆమోదం తెలపాల్సింది రాష్ట్రపతి.రాజ్యాంగ సమీక్ష చేసే అధికారాన్ని తమ చేతుల్లోకి తీసుకున్న ఈ ఇద్దరు న్యాయమూర్తుల తీర్పు ఇకపై పెను వివాదానికి కేంద్ర బిందువు కాబోతున్నది. ఈ విషయం ఇక్కడితో అయిపోలేదు. కేంద్ర ప్రభుత్వ హోంశాఖ ఈ విషయంపై సుప్రీంకోర్టు ధర్మాసనంలో అప్పీలు చేయనున్నది.

ఇక న్యాయమూర్తుల నియామకం స్వయంగా మేమే చేసుకుంటామని ఒక సొంత "కొలీజియం" ఏర్పాటు చేసుకొని శాసన వ్యవస్థ, పాలనా వ్యవస్థలను ప్రేక్షక పాత్రకు పరిమితం చేసిన సుప్రీం కోర్ట్ స్వయం నిర్ణయాధికారం ఇప్పుడు మళ్లీ తాజాగా చర్చలోకి వస్తున్నది.ఈ కొలీజియం పార్లమెంటు ఆమోదం లేకుండా ఏర్పాటు చేసుకోవచ్చా?. శాసన వ్యవస్థ పాలన వ్యవస్థ కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమా? ఈ అనే చర్చకు మళ్లీ ప్రాణం పోసింది ఈ తీర్పు. శాసన వ్యవస్థకు పాలన వ్యవస్థకు లేని విశేష అధికారాలు న్యాయ వ్యవస్థకు ఎలా సంక్రమిస్తాయని న్యాయ కోవిదుల నుండి బలమైన ప్రతిఘటన ఎదురవుతున్నది. సుప్రీం కోర్టులో ఏప్రిల్ 8వ తేదీన వెలువడిన ఈ తీర్పు ఇప్పుడు న్యాయ వ్యవస్థ పని విధానంపై అనుమానాలను మరింత బలంగా ప్రజల ముందుంచింది. శాసన వ్యవస్థ పై పాలన వ్యవస్థపై అతిక్రమణ జరుపుతున్న న్యాయవ్యవస్థపై సమీక్ష చేసే సమయం వచ్చిందని విజ్ఞుల అభిప్రాయం.న్యాయ వ్యవస్థ పాత్ర మన ప్రజాస్వామ్య గణతంత్ర దేశంలో తక్కువ కాదు. అలా ఎప్పుడూ ఇటువంటి ప్రశ్న ఎదురు కాలేదు.కానీ స్వయంగా న్యాయవ్యవస్థనే ఈ ప్రశ్న లేవనెత్తడానికి అవకాశాన్ని కల్పించింది.న్యాయవ్యవస్థ రాజ్యాంగానికి అతీతమైన వ్యవస్థ కాదు. రాజ్యాంగం కల్పించిన బాధ్యతలతో తన హద్దులలో మెదలవలసిన అవసరాన్ని ఇప్పుడు సుప్రీంకోర్టు స్వయంగా దేశం ముందు ఉంచింది.న్యాయ వ్యవస్థలో సంస్కరణలకు సమయం వచ్చిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పారదర్శకతకు ప్రతిబింబంగా ఉండాల్సిన న్యాయవ్యవస్థ కు మళ్లీ ఒకసారి హద్దులు నిర్దేశించాల్సిన చారిత్రక అవసరం ఇప్పుడు మన దేశం ముందున్నది.

న్యాయమూర్తులు కూడా సగటు ఆలోచనా ధోరణితో వ్యవహరిస్తే దేశానికి మంచిది కాదని, ఈ పరిస్థితి నుండి, ఈ రాజ్యాంగ సంక్షోభం నుండి సులభంగా మన దేశం బయటపడాలని అందరము కోరుకోవాలి.

ఇంత ఉత్తమమైన భారత రాజ్యాంగంతో ఎవరు కూడా ఆటలాడకూడదని అర్థమవుతున్నది.

- **రాజకీయ అధినాయకుల, అధికారుల, న్యాయమూర్తుల ఉన్నతమైన ఆదర్శవంతమైన ప్రవర్తన మాత్రమే మన రాజ్యాంగానికి రక్ష**
- **మన మన భారత రాజ్యాంగ సమీక్షలో వెలుగులు నింపడానికి ఆ దివ్యమూర్తి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దివ్యాత్మ మళ్లీ ఒకసారి మనపై ఆశీర్వాదాలు వెదజల్లాలని, ఈ సంశయము సంక్షోభంగా మారకుండా చూడాలని మనందరం కోరుకోవాలి**




# అగ్నివీరులకు గడువు పెంపు

**ఆకుల రంజిత్, కరపత్రం ప్రతినిధి మంగళవారం, ఏప్రిల్ 15:**

– ఈ నెల 25 వరకు "అగ్నివీర్ రిజిస్ట్రేషన్"ల గడువు పెంపు




"అగ్ని వీర్" పథకం కింద యువకులు తమ రిజిస్ట్రేషన్లు చేసుకోటానికి ప్రభుత్వం ఈనెల 25 వ తేదీ వరకు గడువు పెంచిందని జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య తెలిపారు.యువకులు భారతీయ సైన్యంలో చేర్చడానికి అగ్ని వీర్ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.అర్హత గల అభ్యర్థులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర కళాశాల ఉన్నత విద్యా కమిషనర్ (సీసీఈ) శ్రీమతి ఏ.శ్రీదేవసేన సర్క్యులర్ ను జారీ చేశారని ఆయన గుర్తు చేశారు.ఆ సర్క్యులర్ ప్రకారం అగ్నివీర్ పథకం గురించి తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సీసీఈ అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ లకు జారీచేసిన సర్క్యులర్ లో పేర్కొన్నారని అన్నారు. భారత సైన్యంలో యువకులు చేరి, దేశ సేవ చేయాలని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య యువతకు పిలుపునిచ్చారు.2025–2026 సంవత్సరంలో అగ్ని వీర్ పథకం కింద యువతను భర్తీ చేయటానికి రిజిస్ట్రేషన్ గడువు తేదీ ఈ నెల 25 వ తేదీ వరకు పెంచిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య యువతకు పిలుపునిచ్చారు.

# ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**- వైల్డ్ లైఫ్ సేవలు అమోఘం**
**- కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సెలర్ కె ప్రతాపరెడ్డి**

**కరపత్రం-కాకతీయ యూనివర్సిటీ:**
ప్రకృతిని పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ కె ప్రతాపరెడ్డి అన్నారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ ఎన్జివో వరంగల్ తాము స్వయంగా తీసిన అటవీ ఛాయా చిత్రాల (వైల్డ్లైఫ్ ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్) ప్రదర్శనశాలను కాకతీయ విశ్వవిద్యాలయ వాణిజ్య, వ్యాపార నిర్వహణ కళాశాలకు ఎదురుగ



స్టాల్ లో ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఔల్స్



స్వయంగా తీసి వివరనలతో కూడిన అటవీ ఛాయా చిత్రాలు, అందమైన జలపాతలు గ్యాలరీ ప్రదర్శన సందర్భంగా యూనివర్సిటీ వాణిజ్య, వ్యాపార విద్యార్థినీ విద్యార్థులకు, ఆచార్యులకు ప్రకృతి, పర్యావరణం, అడవి, అటవీ జంతువులు, సహజవనరులు వాటి ప్రాధాన్యత, వాటి పాత్ర, వాటి జీవన విధానం, సంరక్షణ, తరిగిపోతున్న వనాలు, వన్యాలు, వాటి విలువలు, అటవీ ఛాయచిత్ర విశిష్టత అవసరాలగూర్చి ముఖ్యంగా జలపాతల వ్యవస్థల గూర్చి తమ అనుభవాలను ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు



ఇందారం నాగేశ్వర్ రావు ఈ సందర్భంగా వాణిజ్య, వ్యాపార పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్థులకు, ఆచార్యులకు ప్రతీ ఛాయచిత్రాన్ని ప్రకతిలో దాని ధర్మాన్ని తెలియచేస్తూ అవగాహనా కల్పించారు. అదేవిధంగా ఓరుగల్లు వైల్డ్లైఫ్ సొసైటీ జాయింట్ సెక్రటరీ, ప్రముఖ పర్యావరణ వేత్త రవిబాబు పిట్టల విద్యార్థులకు, అధ్యాపకులకు భూగ్రహం, బౌమ్యావరణం, జీవవరణం అటవీ ఆవరణం, జలావరణం, వాయు ఆవరణం ముఖ్యంగా అటవీ వ్యవస్థల తీరుతెన్నులు, వన్యప్రాణులు వాటి ఆవశ్యకత పై వివరించారు. సహజ వనరుల తరుగుదలకు ప్రధాన కారణాలు, పర్యావరణ, అటవీ, నీటి, వాయు చట్టాలను, జంతువుల, పక్షుల వేట, అక్రమ రవాణా (వైల్డ్ ట్రేడ్), దాని పర్యవసానాలు, భారత రాజ్యాంగం ఆర్టికల్ 51ఏ/(జి) ప్రకారంగా తమ చుట్టూ వున్నా పర్యావరణం, అడవులు, వన్యప్రాణుల పట్ల భూతదయ, సహజ వనరులను రక్షించి కాపాడుకోవడం ఈ దేశ ప్రతీ పౌరుని ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. పూర్వికులు మనకిచ్చిన ఈ జాతీయ సంపదలను అవసరమున్నంతే వాడుకొని ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని ఒక ఆస్తిగా భావించి ఈ జాతీయ సంపదను ఇదేరూపంలో రాబోవు తరాలకు వారసత్వ ఆస్తిగా కాపాడి ఇవ్వాలని హితువు పలికారు. ఏమరపాటుగా బాధ్యత మరిచి మెదులుకుంటే మిగిలి ఉన్న వనరులు దుర్వినియోగం అవుతాయన్నారు. వాటిని అవసరమున్నంతే వాడుకుంటేనే మానవ, ఇతర జీవుల మనుగడ కొనసాగుతుందని భవిష్యత్ పరిణామాలను వివరించారు. మానవులతోపాటు ఈ భూమండలంపైన అన్ని జీవులకు సమానమైన జీవించే హక్కు ఉందని, అహక్కును మానవుడు తమకొక్కరికే ఉందని విర్రవీగుతూ మారుతున్న పర్యావరణ మార్పులను లెక్కచేయకుండా ప్రకృతి వైపరిత్యాల ప్రకోపానికి గురి అవుతున్నాడని గుర్తు చేసారు. భూమి కోత మరియు భూమి కాలుష్యం, జల కాలుష్యం, గాలి కాలుస్యం కారణాలు, రక్షణ చర్యలు వివరించారు. ఇకనైనా ప్రకృతి చేస్తున్న వైపరీత్యాల హెచ్చరికలను మానవుడు సూక్ష్మంగా అర్థం చేసుకొని తమలో మార్పుతేచ్చుకొని వ్యక్తిగత భాద్యతగా ఉండాలని గుర్తుచేసారు. విద్యార్థులు అడిగినసందేహాలను వివరనతో అవగాహనా కల్పించారు. ఈ ఫోటో ఎగ్జిబిషన్ లో కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రో. వి. రామచంద్రం, వాణిజ్య, వ్యాపార నిర్వహణ కళాశాల ప్రిన్సిపాల్ ప్రో. పసునూరి అమరవేణి, ఆచార్యుల బృందానికి, అలాగే"టార్చ్ ఎన్జీవో వ్యవస్థపాక అధ్యక్షులు అరవింద్ ఆర్యా కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సందర్భంగా అటవీ ఛాయా చిత్రాల (వైల్డ్లైఫ్ ఫోటో గ్యాలరీ ఎగ్జిబిషన్) ప్రదర్శనశాలకు నిర్వహించుకునే అవకాశామిచ్చిన "సినర్జీ - 2కె25 విద్యార్థుల సమ్మేళనం" కార్యవర్గసభ్యులు, కోఆర్డినేటర్స్ కుమారి సౌమ్యశ్రీ, సంయుక్త, భరత్, జయంత్, బి. పవన్, సాయి ఉజ్వల, జె. సచిన్, పాషా, ప్రవీణ్, రాధాకృష్ణ, స్నిగ్ధ, కావ్య, సంజన, కార్యనిర్వాహకులు కాకతీయ యూనివర్సిటీ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రలలో అన్ని సౌకర్యాలు కల్పించాలి

**- కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్**





**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

కోనుగోలు కేంద్రలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రం లో సహకారసంఘం అధ్వర్యంలో ఎర్పాటు చేసిన వరిధాన్య కొనుగోలు కేంద్రంను కోరుట్ల ఎమ్మెల్యే డా.కల్వకుంట్ల సంజయ్ స్థానిక నాయకులతో కలిసి పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకవచ్చి అమ్ముకోవాలన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని ఆయన సుచించారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగనీయకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే పెర్కోన్నారు. ఈకార్యక్రమంలో సహకారసంఘం చైర్మన్ బద్దం గోఫి,నాయకులు నేమురి సత్యనారాయణ,ఎలాల దశరథ్ రెడ్డి,నోముల లక్ష్మరెడ్డి,ఊటురి ప్రథిఫ్,జాజల జగన్ రావు,పుప్పాల నర్సయ్య, గుంటి దేవయ్య, రెబ్బటి రాజేందర్ ,విండో సిఇఓ మంత్రి సతిష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి అవగాహన సదస్సు

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధ్వర్యంలో నూతనంగా ధరణి పోర్టల్ స్థానం లో వచ్చిన భూ భారతి పైన జిల్లా కలెక్టర్ శ్రీ సత్యప్రసాద్ గారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును గురువారం మధ్యాహ్నం 1.00 గంటకు ఇబ్రహింపట్నం గ్రామ పంచాయతీ కార్యాలయం లో నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఇబ్రహింపట్నం తహశీల్దార్ శ్రీ ప్రసాద్ గారు తెలిపారు. ఈఅవగాన కార్యక్రమంకు ప్రజా ప్రతినిదులు,మండల రైతులు, అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ కోరారు.



మాట్లాడుతున్న ఇబ్రహింపట్నం తహశీల్దార్ ప్రసాద్

# వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలని సిపిఎం డప్పు చాటింపు

**- ఈచాటింపుతోనైనా ప్రభుత్వం మేల్కొని వడ్ల కొనుగోలు ప్రారంభించాలి**
**- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి**

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 15**
జిల్లాలో వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, కొనుగోలు చేపట్టని ప్రభుత్వ, అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డప్పు చాటింపు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు మేల్కొని కొనుగోలు సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక తిమ్మాపూర్ మండల కేంద్రంలో ధాన్యం కల్లాల దగ్గర జరిగిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అధికార యంత్రాంగాన్ని మేల్కొల్పే డప్పు చాటింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ గత 15 రోజుల నుండి జిల్లాలో వరి కోతలు ప్రారంభమైనాగాని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని అన్నారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా కనీసం 20 కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదని అన్నారు. ప్రారంభించిన కొద్దిపాటి కొనుగోలు కేంద్రాలు రిబ్బన్ కట్ చేసి,కొబ్బరికాయలు కొట్టి గాలికి వదిలేస్తున్నారని, వరి ధాన్యం కొనుగోలు నేటికీ జిల్లాలో ఒక్క క్వింటాల్ ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం దిగుబడి కి ముందే అధికార యంత్రాంగం ఎందుకు ప్రణాళికలు, తగిన ఏర్పాట్లు సిద్ధం చేసుకోలేదని ప్రశ్నించారు.ఒకపక్క



వాతావరణంలో మార్పుల కారణంగా అకాల వర్షాల ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో రైతులకు పండించిన పంటను కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే,మరోపక్క ప్రైవేట్ దళారులు కనీస మద్దతు ధర కంటే తక్కువతో కొనుగోలు చేస్తున్నారని అన్నారు. దీనితో రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం మూలంగా, పండించిన పంటను కాపాడుకునే అవకాశం లేక విధి లేని పరిస్థితిలో రైతాంగం నష్టానికైనా ప్రైవేట్ దళారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్కు 1700 రూపాయలకు అమ్ముకుంటున్నారని దీంతో రైతు క్వింటాల్కు ఐదు నుండి 600 నష్టపోతున్నాడని అన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన జీవో ప్రకారం కనీస మద్దతు ధర కల్పించాలని, బోనస్ క్వింటాల్కు 500 అన్ని రకాల వరి ధాన్యానికి ఇవ్వాలని, కొనుగోలు జరిగిన రెండు రోజుల్లో రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రైతులకు సరిపడా గన్ని సంచులు,సుతిల్ దారాలు, తార్పాలిన్లు, రవాణా సౌకర్యం, కొనుగోలు కేంద్రాలలో మంచినీటి సౌకర్యం, టెంటు నీడ సౌకర్యం, బాత్రూమ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో రైస్ మిల్లర్లు ఒక బస్తా మీద ఐదు కిలోల చొప్పున రైతులను నిలువు దోపిడీ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు జిల్లా అధికారులు రైతులకు ఎటువంటి కటింగులు లేకుండా సంచి బరువు తీసేసి 40 కిలోలు కాటా వేయాలని, ఎక్కువ తూకాలు వేయకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్ర నిర్వాహకులు రైస్ మిల్లలతో కుమ్మక్కై మ్యాచర్ రావట్లేదు అని చెప్పి ఒక్క క్వింటాలకు 8 నుంచి 10 కిలోల దోపిడీ గతంలో జరిగిందని దాన్ని ఈసారైనా నిలువరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అన్ని గ్రామాలలో యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని, ప్రైవేట్ దళారుల బారి నుండి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులందరిని ఐక్యం చేసి ఎక్కడికి అక్కడ దశలవారీగా గ్రామస్థాయిలోనే ఆందోళన పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకరి సంపత్, సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మాతంగి శంకర్, మండల నాయకులు మాతంగి వెంకటస్వామి వేనంక కుమార్, నాగరాజు, వేల్పుల కుమార్, ఆడిచర్ల ,వెంకటేష్ బోళ్ల మొగిలి ,గడ్డి రాజయ్య, మాతంగి వెంకటేష్ ,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27న జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయండి

**- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**కరపత్రం-హుజురాబాద్:**
బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 27న నిర్వహించబోయే బహిరంగ సభను విజయవంతం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం హుజూరాబాద్ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల కంటే హుజూరాబాద్ నుంచే అత్యధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఈ



సభ ద్వారా చాటాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలను నమ్మించి ప్రజలను మోసం చేసిందని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామన్నారని, కానీ 16 నెలలు గడిచినా ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ హామీలను నెరవేర్చే వరకు పోరాడుతానన్నారు. ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులకు న్యాయం జరగట్లేదని, రైతుబంధు, రుణమాఫీ, రైతు బీమా, 24 గంటల కరెంట్ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా అన్యాయం చేస్తోందన్నారు. కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడిన రైతులను ఈ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబతారని, మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అధికారం చేజిక్కించుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గందే రాధిక శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్ తదితర నేతలు పాల్గొన్నారు.